క్లుప్తంగా

ఓటుహక్కు ప్రాధాన్యంపై అవగాహన



గరికపాడు(కాకుమాను): ఓటు హక్కు ఎంతో విలువైనదని, అలాంటి విలువైన ఓటు గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని తహసీల్దార్ పార్వతి అన్నారు. మండలంలోని గరికపాడులో గురువారం ఓటర్లను చైతన్య పరచడం, వారిని భాగస్వాములు చేయడం కార్యక్రమంలో భాగంగా ఓటు హక్కుపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అనేది వజ్రాయుధంలాటిందని, అలాంటి ఎంతో విలువైన ఓటు గురించి ప్రతి ఒక్కరు తెలుసుకోవాలని ఆయన సూచించారు. మద్యం, నగదు, ఇతర ప్రలోభాలాకు గురికాకుండా ప్రతి ఒక్కరు తమ పవిత్రమైన ఓటును వినియోగించుకోవాలని అప్పుడే ప్రతి ఒక్కరు సంతోషంగా ఉంటారని ఆమె తెలిపారు. ఓటుతోనే దేశ ప్రగతి ఉందన్న విషయాన్ని ప్రతి ఒక్కరు గమనించాలని ఆమె కోరారు. ఈసందర్భంగా ఓటు హక్కు ప్రాధాన్యత గురించి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. గ్రామస్తులు, సిబ్బంది పాల్గొన్నారు.

పుట్టపర్తి నారాయణాచార్యులుకు ఘననివాళి



గుంటూరు రూరల్: పద్మశ్రీ పుట్టపర్తి నారాయణాచార్యులు ఒక గొప్ప తెలుగు కవి అని, ఆధునిక మహాకావ్యంగా పలువురు పండితులు కొనియాడిన శివతాండవం సృష్టికర్త అని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ ఆర్.శారదజయలక్ష్మీదేవి తెలిపారు. గురువారం నగర శివారుల్లోని లాంఫాం నందున్న విశ్వవిద్యాలయం పరిపాలన భవనంలో పుట్టపర్తి నారాయణచార్యుల జయంతి సందర్భంగా ఘనంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ బహుభాషా కోవిదుడు, అనర్గళంగా ఎనిమిది భాషల్లో మాట్లాడగలుగుతూ, 14 భాషల్లో పట్టు కలిగిన మహాకవి అయనని కొనియాడారు. విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ కె.గురవారెడ్డి, డీన్ ఆఫ్ అగ్రికల్చర్ డాక్టర్ జి.కరుణసాగర్, పీజీ స్టడీస్ డీన్ డాక్టర్ ఏవీ రమణ, ఇంజినీరింగ్ డీన్ డాక్టర్ ఎ.మణి, కమ్యూనిటీ సైన్స్ డీన్ డాక్టర్ జి.రామారావు, రీసెర్చ్ డైరెక్టర్ డాక్టర్ ఎల్.ప్రశాంతి, ఎక్స్టెన్షన్ డైరెక్టర్ డాక్టర్ బి.విజయాభినందన, ఎగ్జామినేషన్ కంట్రోలర్ డాక్టర్ మునిరత్నం, కంప్ట్రోలర్ డాక్టర్ వై.పద్మలత తదితరులు పాల్గొన్నారు.

గురువు జీవితం అతి పవిత్రం

ఫాదర్ దిలీప్ కుమార్



ప్రత్తిపాడు: గురువు జీవితం ఎంతో పవిత్రమైనదని పునీత శౌరివారి పుణ్యక్షేత్రం ఫాదర్ దిలీప్‌కుమార్ అన్నారు. వట్టిచెరుకూరు మండలం ముట్లూరులోని పునీత శౌరివారి పుణ్యక్షేత్రంలో కథోలిక సభ గురువుల పండుగైన పవిత్ర గురువారం (పెద్ద బేస్తవారం)ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పునీత శౌరివారి పుణ్యక్షేత్రం ఫాదర్ దిలీప్ కుమార్ మాట్లాడుతూ కథోలిక సంఘంలో పనిచేస్తున్న క్రైస్తవ మత గురువులకు గుర్తుగా ఈరోజు పవిత్ర గురువారం పండుగ నిర్వహించామన్నారు. తోటివారిని, శత్రువులను సైతం ప్రేమించాలని కోరారు. ఏసు ప్రభువు తన మరణానికి ముందురోజు శిష్యులతో కలిసి కడరా భోజనం చేశారని విశ్వాసులకు గుర్తుచేశారు. అనంతరం క్రీస్తు ప్రేమకు గుర్తుగా పన్నెండు మంది విశ్వాసుల పాదాలు కడిగారు. అర్ధరాత్రి పన్నెండు గంటల వరకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫాదర్ పవన్, మఠకన్యలు, విశ్వాసులు పాల్గొన్నారు.

లక్ష్య సాధనకు కృషి చేయాలి

కళాశాల విద్య గుంటూరు ప్రాంత సంచాలకులు పి.కళావతి

చేబ్రోలు: విద్యార్థులు లక్ష్యాన్ని ఏర్పరుచుకొని వాటి సాధనకు నిరంతరం కృషి చేయటం ద్వారా ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని కళాశాల విద్య గుంటూరు ప్రాంత సంచాలకులు పి.కళావతి పేర్కొన్నారు. చేబ్రోలులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం కళాశాల వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో పి.కళావతి మాట్లాడుతూ టెక్నికల్ స్కిల్స్‌పై పట్టు సాధించిన వారికి ఉద్యోగ అవకాశాలు మెరుగ్గా ఉంటాయన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ విడదల శ్రీదేవి వార్షిక రిపోర్టును వివరించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు, మెమెంటోలను అందజేశారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అవి 'నీటి' రాజకీయం!

తోకావారిపాలెం ప్రజల 40 ఏళ్ల కలను అడ్డుకున్న టీడీపీ నేతలు

- 20 ఏళ్లుగా సమీప గ్రామం నుంచి తాగునీటిని తెచ్చుకుంటున్న ప్రజలు
- వాగు పోరంబోకులో చెరువు తవ్వకాలకు పంచాయతీ తీర్మానం
- జిల్లా కలెక్టర్ ఆదేశాలు సైతం బేఖాతరు
- తమ గ్రామానికి తాగునీటి చెరువు ఏర్పాటు చేయాలని కోరుతున్న ప్రజలు



సర్వే నంబర్ 32లో వాగు పోరంబోకు స్థలం

గుంటూరు రూరల్: గ్రామ ప్రజల 40 ఏళ్ల కల గ్రామానికి తాగునీటి చెరువు. తాగునీటికోసం ఇబ్బందులు పడుతూ సమీప గ్రామమైన దాసుపాలెం నుంచి తాగునీటిని తెచ్చుకోవాల్సిన పరిస్థితి. గ్రామంలో ఉన్న వాగు పోరంబోకు పొలంలో తాగునీటి చెరువు ఏర్పాటుకు గ్రామ సర్పంచ్ జిల్లా అధికారులనుంచి అనుమతులు పొందినా టీడీపీ నేతలు కుట్రలు పన్ని గ్రామ ప్రజల తాగునీటి కలను కల్లగా మార్చారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని తోకవారిపాలెం గ్రామంలో మొత్తం 1500 మంది నివసిస్తుంటారు. గత 20 ఏళ్ల క్రితం సమీప గ్రామం దాసుపాలెం నుంచి పైప్‌లైన్ ద్వారా సుమారు 5 కిలో మీటర్లు పైపులను ఏర్పాటు చేసి తాగునీటిని తెచ్చుకుంటున్నారు. ఈ క్రమంలో ఒక్కోసారి ఆ గ్రామానికి నీరు సరిపోకపోతే తోకావారిపాలెంకు నీరు లేనట్టే. తోకావారిపాలెం గ్రామంలో బోర్లను ఏర్పాటు చేసినా ఆ నీరు తాగేందుకు పనికిరాకుండా ఉప్పుగా ఉంటున్నాయని ఎక్కువ మోతాదులో ఫ్లోరిన్ ఉండటంతో అనారోగ్య సమస్యలు వస్తున్నాయని గ్రామస్తులు వాపోతున్నారు.

చెరువు నిర్మాణమే సమస్యకు పరిష్కారం..

గ్రామ తాగునీటి ఇబ్బందులు పరిష్కారం కావాలంటే గ్రామానికి తాగునీటి చెరువు ఉండాలని సర్పంచ్ దొడ్డా సామ్రాజ్యం ప్రజల మద్దతుతో సంకల్పించారు. గ్రామలోని సర్వే నంబర్ 32లో వాగు పోరంబోకు పొలం 4.23 ఎకరాలు ఉంది. ఈ పొలానికి సమపంలో సుమారు అర కిలోమీటర్ దూరంలో సాగర్ కాలువ ఉంది. వాగు పోరంబోకు పొలంలో చెరువును తీసి దానికి సాగర్ కాలువ ద్వారా నీటిని నింపుకొన్నట్టయితే పక్కనే ఉన్న వాటర్‌ట్యాంక్ ద్వారా గ్రామ ప్రజల తాగునీటి ఇబ్బందులు తీర్చవచ్చని గ్రామ పంచాయతీ తీర్మానించింది. అదే తడవుగా మండలస్థాయి అధికారులు, జిల్లా అధికారులు, కలెక్టర్ అనుమతులు పొందారు.

అడ్డుకున్న టీడీపీ నేతలు..

అయితే చెరువు తీత పనులు ప్రారంభించే క్రమంలో నియోజకవర్గం టీడీపీ అభ్యర్థి, టీడీపీ నాయకులు చెరువు తీసే కార్యక్రమాన్ని అడ్డుకున్నారు. ఈ పొలంలో తమకు భూములు ఉన్నాయని చెరువు తీసేందుకు ఒప్పుకోమంటూ అడ్డుకట్ట వేశారు. అదే పొలంలో తమ భూములు ఉన్నాయని గ్రామ తాగునీటి సమస్యను పరిష్కరించుకునేందుకు తాము తమ భూమిని ఇచ్చినట్లు మిగిలిన రైతులంతా ముక్తకంఠంతో గ్రామానికి చెరువు కావాల్సిందేనని తేల్చారు. కానీ ఒకరిద్దరు టీడీపీ నాయకులు చెరువు తీసేందుకు తాము ఒప్పుకోమంటూ స్థానిక టీడీపీ నేతలు, నియోజకవర్గం టీడీపీ అభ్యర్థి అడ్డుపడ్డారు. తమ గ్రామానికి ఎలాగైనా తాగునీటి చెరువును ఏర్పాటు చేసి తమను ఆదుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

సమస్య పరిష్కారాన్ని టీడీపీ అడ్డుకుంటుంది ..



సుమారు 40 ఏళ్లుగా గ్రామంలోని ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. తాగునీటి చెరువు లేకపోవటంతో నిత్యం నీటి సమస్య ఉంటూనే ఉంది. తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారం కోసం ఆలోచన చేయగా వాగుపోరంబోకు భూమిలో చెరువు నిర్మాణం చేయాలని పంచాయతీ తీర్మానించింది. కానీ టీడీపీ నాయకులు కావాలని ఒకరిద్దరితో స్థానిక ఎమ్మెల్యే అభ్యర్థి అడ్డుకుంటున్నాడు. అధికారులు స్పందించి గ్రామంలోని 1500 మంది సమస్యను పరిష్కరించి చెరువు తీత పనులు ప్రారంభించేలా చూడాలి.

– దొడ్డా సామ్రాజ్యం, గ్రామ సర్పంచ్ తోకవారిపాలెం గ్రామం

గ్రామ ప్రజల కోసమే చెరువు..



గ్రామ ప్రజల తాగునీటి సమస్య పరిష్కారానికే చెరువు తీస్తున్నారు. అందులో ఉన్న అందరు రైతులు ఒప్పుకుంటున్నారు. టీడీపీ నాయకులు ఒకరిద్దరు మాత్రమే గ్రామ ప్రజల సమస్య పరిష్కారం కాకుండా అడ్డుకుంటున్నారు. 1500 మంది ప్రజల సమస్య ఇది. అధికారులు స్పందించి ఆదుకోవాలి.

– దేశమాల వెంకయ్య, రైతు, తోకావారిపాలెం

నా భూమి ఇస్తాను..



చెరువు కోసం అధికారులు సూచించిన పొలంలో నాకు కొంత భూమి ఉంది. దానిలో గతంలో సాగు చేశాం. కానీ ఇప్పుడు గ్రామ ప్రజల కోసం చెరువు తవ్వకానికి అందరం కలిసే ఇస్తున్నాం. ఒకరిద్దరి వల్ల గ్రామ ప్రజలంతా ఇబ్బంది పడుతున్నారు. కేవలం టీడీపీ నాయకులు కావాలనే చెరువుతీత పనులు అడ్డుకుంటున్నారు.

– దొడ్డా లూర్దురాజు, రైతు, తోకావారిపాలెం

మాకు కొంత భూమి ఉంది.. చెరువుకు ఇస్తాం



వాగు పోరంబోకులో నాకు కొంత భూమి ఉంది. గ్రామ ప్రజల తాగునీటి సౌకర్యం కోసం నేను నా భూమిని చెరువు కోసం ఇస్తున్నాను. కాని కొందరు అడ్డు పడుతున్నారు. ప్రజల 40 ఏళ్ల కలను టీడీపీ నాయకులు అడ్డుకుంటున్నారు.

– దొడ్డా దాసు, రైతు, తోకావారిపాలెం

చెరువు కోసం మేమంతా సిద్ధం..



తాగునీటి సమస్య పరిష్కారం కోసం గ్రామ సర్పంచ్ చొరవ తీసుకుని గ్రామ ప్రజల 40 ఏళ్ల సమస్యను పరిష్కరించాలని ప్రయత్నిస్తుంటే కావాలని టీడీపీ కుట్రలు పన్నుతోంది. ప్రజలకు మంచి జరుగుతుంటే చూసి ఓర్వలేక టీడీపీ నేతలు అడ్డుకుంటున్నారు. అధికారులు స్పందించి గ్రామానికి చెరువును తవ్వించాలి.

– ఉల్లమనీడి బాల, రైతు, తోకావారిపాలెం

మహనీయుల జీవితాలు ఆదర్శం

- ఆంధ్రా యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ కె. రాంజీ
- జీఈసీ కళాశాలలో ఘనంగా వార్షికోత్సవం



ప్రత్తిపాడు: మహనీయుల జీవితాలను నేటితరం యువత ఆదర్శంగా తీసుకోవాలని ఆంధ్రా యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ కె. రాంజీ అన్నారు. ప్రత్తిపాడు మండలం యనమదల గుంటూరు ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం కళాశాల 16వ వార్షికోత్సవం ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథులుగా ఆంధ్ర యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్. కె.రాంజీ, సినీ నటుడు పృథ్వీలు హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా రాంజీ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి జీవితంలో ఉన్నత స్థితికి చేరుకోవాలంటే మంచి లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలన్నారు. మహనీయుల జీవిత చరిత్రలను ఆదర్శంగా తీసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. సినీ నటుడు పృథ్వీ మాట్లాడుతూ విద్యార్థులు చదువుకునే సమయంలో సోషల్ మీడియా మత్తులో పడి తమ జీవితాలను పాడుచేసుకోవద్దని చెప్పారు. కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు మాట్లాడుతూ సాంకేతిక ప్రపంచంలో రాణించాలంటే ఇంజినీరింగ్ విద్యతోపాటు ఆన్‌లైన్ కోర్సులు కూడా అవసరమేనన్నారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ కోయి శేఖర్, అకడమిక్ డైరెక్టర్ గోగినేని సాంబశివరావు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. రామకోటయ్య తదితరులు పాల్గొన్నారు.

జబర్దస్త్ టీం స్కిట్లతో జోష్..

కళాశాలలో జరిగిన వార్షికోత్సవంలో స్పెషల్ అట్రాక్షన్‌గా సినీ గ్లామర్ జోడయ్యింది. ఉదయం సినీ నటుడు పృథ్వీ, సాయంత్ర జబర్దస్త్ టీం శాంతి స్వరూప్, దొరబాబు, రైజింగ్ రాజు, హరితలు హాజరయ్యారు. వీరు కామెడీ స్కిట్‌లు, డ్యాన్సులతో ఫుల్ జోష్ నింపారు. పంచ్‌లు పేలుస్తూ విద్యార్థులతో కలిసి సందడి చేశారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన

- సీఎం వైఎస్ జగన్‌కు ప్రతి ఒక్కరూ అండగా నిలవాలి
- వైఎస్సార్ సీపీ పొన్నూరు ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి మురళీకృష్ణ
- జగనన్న మళ్లీ సీఎం అయితేనే ప్రజలకు మేలు : ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే)
- పొన్నూరులో యానాది సంఘాల ప్రజలు, నేతలతో ఆత్మీయ సమావేశం



సభలో మాట్లాడుతున్న అంబటి మురళీకృష్ణ, వేదికపై మంగళగిరి ఎమ్మెల్యే ఆర్కే, తదితరులు

పొన్నూరు: పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో పాలన సాగిస్తున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పొన్నూరు ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి మురళీకృష్ణ పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పొన్నూరు నియోజకవర్గం ఎస్టీ(యానాది) సంఘాలు, ప్రజలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. సభకు పార్టీ రాష్ట్ర ఎస్టీ సెల్ అధికార ప్రతినిధి ఎండేటి వెంకటసుబ్బయ్య అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ యానాదుల సంక్షేమం వైఎస్సార్ సీపీతోనే సాధ్యమని పేర్కొన్నారు. సామాన్య, మధ్యతరగతి ప్రజలకు ఆర్థికంగా తోడ్పాటునందించేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గత ఐదేళ్ల కాలంలో నియోజకవర్గంలో రూ.1,679 కోట్లను డీబీటీ రూపంలో నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. రూ. 200 కోట్లతో నియోజకవర్గంలో అభివృద్ధి జరిగిందన్నారు. మరో 10 ఏళ్ల పాటు రాష్ట్రంలో ఇదే ప్రభుత్వం అధికారంలో ఉంటే మన పొన్నూరు అభివృద్ధిలో అగ్రస్థానంలో ఉంటుందన్నారు. సీఎం అడుగుజాడల్లో పొన్నూరు అభివృద్ధికి కృషి చేస్తానని, ఒక్క అవకాశం ఇచ్చి రానున్న ఎన్నికలలో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ప్రజలను కోరారు. నియోజకవర్గ పరిశీలకులు, మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి జిల్లాలో ఏఐడీ కార్యాలయం, యానాది సంఘాల కమ్యూనిటీ హాల్ నిర్మించే విధంగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. రాష్ట్రంలో పార్టీ, మతం, కులం చూడకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. విద్యతోనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. గతంలో ఇళ్లులేకుండా యానాదులు ఎంతోమంది ఇబ్బందులు ఎదుర్కొన్నారని, నేడు సీఎం జగన్ ప్రభుత్వంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్లు, సంక్షేమ పథకాలు అందించారని తెలిపారు. జగనన్న పాలనలో ప్రజల ఇంటి వద్దకే ప్రభుత్వ పాలన వచ్చిందన్నారు. మరో 30 ఏళ్లు రాష్ట్రంలో సీఎం జగన్ పాలన కొనసాగుతుందన్నారు. మే 13న జరిగే ఎన్నికల్లో ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులకు సంబంధించిన రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి గెలిపించాలని కోరారు. జగనన్న ప్రభుత్వంలో అందరికీ ఇళ్ల స్థలాలు అందాయా అని రాష్ట్ర ఎస్టీ సెల్ అధికార ప్రతినిధి వెంకట సుబ్బయ్య అడగ్గా, అందరూ చేతులెత్తి మంజూరయ్యాయని హర్షధ్వనుల మధ్య చెప్పడంతో ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి, అభ్యర్థి మురళీకృష్ణ సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం అతిథులను ఘనంగా సత్కరించారు. ట్రికార్ చైర్మన్ గూండా సురేంద్ర, జెడ్పీటీసీ సభ్యులు కర్లపూడి రమేష్, ఏఎంసీ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, నాయకులు ఎం.చిరంజీవి, సిహెచ్.రమేష్, ఎం.వెంకటేశ్వరరావు, కార్యకర్తలు అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

జగనన్నతోనే అభివృద్ధి సాధ్యం

వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు అభ్యర్థి బలసాని కిరణ్‌కుమార్



గుంటూరు రూరల్: రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం జరగాలంటే జగనన్న ద్వారానే సాధ్యమని నమ్మి ఎందరో ప్రజలు వైఎస్సార్ సీపీలో చేరుతున్నారని, పార్టీ ప్రత్తిపాడు ఎమ్మెల్యే అభ్యర్థి బలసాని కిరణ్‌కుమార్ తెలిపారు. గురువారం 41వ డివిజన్ స్వర్ణభారతినగర్, కృష్ణతులసీనగర్ 2, 3, 4 లైన్లకు చెందిన జనసేన, టీడీపీ కార్యకర్తలు 100 కుటుంబాలు, సుమారు 400 మంది కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరారు. ఈ సందర్భంగా వికాస్‌నగర్‌లోని క్యాంపు కార్యాలయంలో బలసాని పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగనన్న సంక్షేమం, అభివృద్ధి చూసి ఎందరో జగనన్నకు మద్దతుగా వైఎస్సార్ సీపీలో చేరుతున్నారన్నారు. చంద్రబాబు, దత్తపుత్రుడిని ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని చెప్పారు. జగనన్న ద్వారానే ప్రతి కుటుంబం ఆర్థికంగా అభివృద్ధి చెందుతుందని ప్రజలంతా రానున్న ఎన్నికలకు తామంతా సిద్ధమంటున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రత్తిపాడు నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ జెండాను ఎగురవేసి అఖండ మెజారిటీతో గెలిపించి జగనన్నకు గిఫ్ట్‌గా ఇద్దామని పిలుపునిచ్చారు. జగనన్నను ముఖ్యమంత్రిని చేస్తేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. మరోసారి జగనన్నను ముఖ్యమంత్రి చేసుకునేందుకు ప్రతి ఒక్కరూ సైనికుల్లా కృషిచేయాలని పిలుపునిచ్చారు. ఆర్అండ్‌బీ కార్పొరేషన్ డైరెక్టర్ పిల్లి మేరి, బొందలపాటి శ్రీను, లక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులున్నారు.

ఆర్‌వీఆర్‌జేసీలో బిజినెస్ మోడల్ కాన్వాస్‌పై సదస్సు



మాట్లాడుతున్న అల్కావ్ పార్ట్‌నర్స్ సంస్థ డైరెక్టర్ శ్రీనివాసన్ శరవణ్ తదితరులు

గుంటూరు రూరల్: విద్యార్థి ఆలోచనలను అంకుర పరిశ్రమల స్థాపన వైపు దృష్టి సారిస్తే భవిష్యత్తులో ఉన్నతస్థాయికి చేరుకోవడం సులభతరం అవుతుందని అల్కావ్ పార్ట్‌నర్స్ సంస్థ డైరెక్టర్ శ్రీనివాసన్ సరవణ్ పేర్కొన్నారు. చౌడవరం గ్రామంలోని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం ఆర్‌జేఈ నెస్ట్ సహకారంతో జరిగిన బిజినెస్ మోడల్ క్యాన్వాస్ సెమినార్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంకుర పరిశ్రమలు ఏవిధంగా స్థాపించాలో వివరించారు. ఆంధ్రా యూనివర్సిటీ ఇంక్యూబేషన్ కౌన్సిల్ సీఈఓ డైరెక్టర్ రవి ఈశ్వరపు, మేనేజర్ దినకర్ వాడపల్లిలు మాట్లాడుతూ అంకుర పరిశ్రమల స్థాపనలో వివిధ దశలను వివరిస్తూ, అది విజయాల దిశగా అభివృద్ధి సాధించడానికి అనుసరించాల్సిన పద్ధతులను, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. విద్యార్థికి ఉద్యోగ ఆలోచనతో సాగే చదువు ఒక స్థాయి వరకే తీసుకెళ్తుందని, ఆ ఆలోచనతో పాటూ అంకుర పరిశ్రమల వైపు ఆలోచనలు విద్యార్థి భవిష్యత్తును మార్చి ఉన్నతస్థాయి చేరువకు దారి చూపుతాయని చెప్పారు. ఆ దిశగా విద్యార్థులను తయారు చేయడానికి కళాశాలలో ఇంక్యూబేటర్ సెంటర్ అందుబాటులోకి రావడం శుభపరిణామమన్నారు. విద్యార్థులు విద్యతో పాటుగా న్యూ స్టార్టప్ శిక్షణను పొందటం వారి ఆలోచనలకు అనుగుణంగా వారు ఎంచుకున్న రంగాలలో విజయం పొందటానికి సాధ్యపడుతుందని కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్ తెలిపారు. నిపుణులచే నిర్వహించే సదస్సులలో శిక్షణ అందుకోవడం ద్వారా విద్యార్థుల మేథాశక్తిని, నైపుణ్యాన్ని మెరుగుపరుచుకోవచ్చని కళాశాల సెక్రటరీ కరెస్పాండెంట్ ఆర్.గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్‌లు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏఓ డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, డాక్టర్ ఎంవీపీ చంద్రశేఖర్ తదితరులున్నారు.

ఆర్‌వీఆర్‌జేసీ అధ్యాపకుడికి డాక్టరేట్



గుంటూరు రూరల్: విద్యార్థులు అధ్యాపకుల ఉన్నతికి తమ కళాశాల ఎల్లపుడూ కృషిచేస్తుందని ఆర్‌వీఆర్ జేసీ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్ తెలిపారు. గురువారం చౌడవరం గ్రామంలోని కళాశాలలో ఏర్పాటు చేసిన అధ్యాపకుని అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తమ కళాశాలకు చెందిన అధ్యాపకుడు చేగూడి రంగారావుకు తమిళనాడుకు చెందిన అన్నామలై విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను ప్రదానం చేసిందన్నారు. పవర్ క్వాలిటీ ఇంప్రూవ్‌మెంట్ ఇన్ మైక్రోగ్రిడ్ త్రూ ఆప్టిమల్ కంట్రోల్ ఆఫ్ రెన్యుబుల్ ఎనర్జీ సోర్సెస్ అనే అంశంపై డాక్టర్ ఆర్.బాలమురుగన్, డాక్టర్ రామకోటేశ్వరరావుల పర్యవేక్షణలో చేసిన పరిశోధనకు డాక్టరేట్ లభించిందన్నారు. ఈ సందర్భంగా డాక్టరేట్ పొందిన అధ్యాపకుడిని కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్, కార్యదర్శి ఆర్.గోపాలకృష్ణ తదితరులు అభినందించారు.

రేపు 'రన్ ఫర్ జీసస్'



విలేకరులతో మాట్లాడుతున్న సతీష్ బాబు

నెహ్రూనగర్: క్రీస్తు పునరుత్థాన దినాన్ని పురస్కరించుకొని మానవాళి శాంతి సుఖ సంతోషాలతో మనుగడ సాగించాలనే ఉద్దేశంతో శనివారం ఉదయం 5 నుంచి 9 గంటల వరకు రన్ ఫర్ జీసస్ కార్యక్రమం గుంటూరు నగరంలో నిర్వహించనున్నట్లు రన్ ఫర్ జీసస్ కో–ఆర్డినేటర్ సెయింట్ మాథ్యూస్ వెస్ట్ పారిస్ పాస్టర్ రెవరెండ్ జి.సతీష్ బాబు తెలిపారు. గురువారం గుంటూరులోని వెస్ట్ పారిష్ చర్చి ప్రాంగణంలో విలేకరుల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. క్రైస్తవ సంఘాల మధ్య ఐక్యత, యువత సమన్వయం, ప్రజల సమభావం పెంపొందించాలనే లక్ష్యంతో క్రీస్తు పునరుత్థానం పురస్కరించుకొని హిందూ కాలేజ్ కూడలి వద్ద ఉన్న వెస్ట్ పారిస్ చర్చి నుంచి రన్ ఫర్ జీసస్ ప్రారంభించనున్నట్లు తెలిపారు. నగరంపాలెం, కలెక్టరేట్, కంకరగుంట ఫ్లైఓవర్, ఎన్టీఆర్ స్టేడియం, లక్ష్మీపురం, లాడ్జి సెంటరు, నార్త్ పారిష్, చర్చి దగ్గర రన్ ముగుస్తుందని వెల్లడించారు.నగరంలోని అన్ని క్రైస్తవ సంఘాలు, సంస్థలు, సంఘస్తులు, విశ్వాసులు వేలాదిగా తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఏఈఎల్‌సీ సినడ్ బిషప్ రైట్ రెవరెండ్ ఎస్‌జే బాబురావు, బొలెద్దు మాథ్యూస్, కె.నిరంజన్, బెంజిమెన్ ఫ్రాంక్లిన్, నెల్సన్, జాన్ పాల్గొన్నారు.